# అన్నపూర్ణ మందిరం



ఊరి పక్కన నది. నది ఒడ్డున జమీందారుగారి తోట. జమీందారుగారు ఎంతో డబ్బు ఖర్చుచేసి చక్కని మెట్లు కట్టించి, రేవు ఏర్పాటుచేశారు. సాయంకాలం అయింది. సతి చంకన బిందె పెట్టుకుని, భుజంమీద చీరా, తుండుగుడ్డా వేసుకుని మెట్లు దిగివచ్చి, పొడిబట్టలు మెట్లమీద పెట్టి, నీటిలోకి దిగింది.

ఇంతలో ఆమె స్నేహితురాలు కమలకూడా అక్కడికి వచ్చింది.

"ఎందుకే, సతీ, విచారంగా ఉన్నావు ?" అన్నది కమల.

"కొత్తగా ఏమీ లేదక్కా ! మా యింటి సంగతి నీకు తెలిసిందేగా !"

"అంతే గద ! నా స్థితిలో ఉంటే నువ్వెంత దిగులుపడేదానివో !"

"నీకు విచార మేమిటి, కమలా ? గొప్పయింటి బిడ్డవు. బోలెడంత ఐశ్వర్యం. అన్నదమ్ములూ, తల్లిదండ్రులూ పడే బాధలు చూడాలా ఏమన్నానా ?"

"అదేమిటి, సతీ ? పేదతనం ఒకటే దుఃఖ మనుకున్నావా ?"

"అయితే నీ కొచ్చిన కష్ట మేమిటో చెప్పు." అంటూ సతి అప్రయత్నంగా చిరునవ్వు నవ్వింది.

"నాకు పెళ్ళి చేస్తారట, విన్నావా ? ఎవరికిచ్చి చేస్తారని అడగవేం ?"

"విషుదాదా కిచ్చి చేస్తారు. తెలిసిన సంగతేగా ?"

---

నిరుపమాదేవి

"అక్కడే పొరపడ్డావు. ఇవాళ ఇంకో సంబంధం వచ్చింది "

"విషుదాదానుతప్ప పెళ్ళాడ నంటివే? మీ అమ్మా, నాన్నా ఒప్పుకోలేదా ?"

"అవతలివాళ్ళు ఆ మాటే ఎత్తకపోతే అమ్మా, నాన్నా ఏంచేస్తారు ?"

కమల మజూత్పూరులో ప్రఖ్యాతిగల జమీందారుల కుటుంబంలో పుట్టినది. నిరుపేద అయిన రామశంకరభట్టాచార్యుడి కూతురైన సతితో కమలకు స్నేహం ఎలా కలిసిందో చెప్పటం కష్టం. ఈ స్నేహాన్ని కమల ఇంటివాళ్ళు ఆమోదించారనుకోవటం పొరపాటు. ధనికులతో సంబంధించినచోట దరిద్రులకు కూడా అభిమానం ఉంటుంది; కమలతో స్నేహం చెయ్యటంలో జాగ్రత్తగా ఉండమని సతిని ఆమెవైపువాళ్ళుకూడా హెచ్చరించారు. కమలకు పదమూడేళ్ళు. సతికి పన్నెండేళ్ళు.

కమల రేవునుంచి ఇంటికి తిరిగివచ్చి, దిగులుగా మంచంమీద పడుకున్నది. మూడేళ్ళక్రితం ఆమె ఏట్లో ఈదబోయి, ప్రవాహంలోపడి కొట్టుకుపోతుంటే, ఒడ్డునఉన్న విశ్వేశ్వరు డామెను బయటికిలాగి కాపాడాడు అతనే తనభర్త కావాలని కమల ఆనాడే నిశ్చయించుకున్నది. విశ్వేశ్వరుడు అందమైనవాడు, యువకుడు, తమశాఖవాడే. అయితే అతనిఇల్లు దూరాన మరొకపేటలో ఉన్నది అతను కమలావాళ్ళ యింటి కెన్నడూ రాడు. కమలను కాపాడిన అనంతరం అతను తిరిగి ఆమెకంట పడనైనాలేదు.

అయినా కమలకు ఈ కొత్తగా వచ్చిన సంబంధం తలుచుకుంటే విచారంగా ఉన్నది.

*  *  *  *  *

అప్పుడే తెల్లవారింది. మరమ్మత్తులులేక కూలటానికి సిద్ధంగాఉన్న తమపూరింటి అరుగుమీద కూర్చుని "గుడుగుడు" తాగుతూ రామశంకరభట్టాచార్యుడు ఆలోచిస్తున్నాడు. ఏ జంతువుకూలేని తిండిసమస్య మనిషికి దేనికి? ఎంతో శ్రమా, ఎన్నో మాయలూ, ఎంతో ప్రయత్నమూ చేస్తేతప్ప మనిషి పొట్ట నిండదేం? తననే నమ్ముకుని సేవచేసేవాళ్ళపై భూదేవికి జాలి లేదేం?

భర్త ఇలా ఆలోచిస్తూ "గుడుగుడు" తాగుతూఉంటే ఆయనభార్య జాహ్నవి ఇంటితలుపు తెరుచుకునివచ్చి, నీళ్ళు తోడి వాకిట చల్లి, తులసికోటచుట్టూ ఊడ్చి అలికింది; తరవాత చేతులు కడుక్కుని భర్తకు చెంబుతోనీళ్ళూ, పలుదోముపుల్లా తెచ్చి అరుగుమీద పెట్టి, "ఇంత పెందలాడే లేచి చల్లగాలిలో కూర్చున్నావేం? రాత్రి గుండెనొప్పి అంటివిగా ?" అన్నది.



"గుండెనొప్పి కూలిపోను. చావు వస్తే బాగుణ్ణు, అన్నిబాధలూ విరగడై పోతాయి." అన్నాడు భర్త.

"ముఖం కడుక్కో."

"కడుక్కుంటాలే. ఇంటో పప్పూ, బియ్యమూ ఉన్నాయా? భూమి అమ్మిన డబ్బంతా అయిపోయిందీ?"

"ఈ మూడునెల్లూ వాటితోనే గడిపాం. ఇంకెన్నాళ్ళొస్తాయీ?"

"ఎక్కణ్ణుంచి తెచ్చేది? కన్నంవెయ్యనా, ముష్టెత్తనా?"

భార్య కంటతడి పెట్టుకున్నది.

"ఏడిచి లాభం ఉంటే నేను ఏడిచేఉందును ఈపూట ఎలాగో జరుపు. రేపటి సంగతి చూసుకుందాం," అంటూ రామశంకరుడు కాలకృత్యాలు నిర్వర్తించటానికి లేచాడు.

వాళ్ళ రెండోకూతురు సావిత్రి నిద్ర లేచి, ఇంటిపనుల్లో ప్రవేశించి, నీళ్ళు తోడసాగింది. పెద్దకూతురు సతి ఇంకా నిద్ర లేవలేదు

వాళ్ళింట్లోనే రామశంకరుడి వదినెగారు పితంతు ఒకామె ఉంటున్నది.

ఆవిడ ఇంటిముందుకు వచ్చి నిలబడి, "తల్లీకూతుళ్ళు మహా పనిచేస్తున్నారు. ఇంటో బియ్యంలేవు. చెబితే వినిపించుకోరు. వెంటనే బజారుకు పోవటం మంచిది. అబ్బాయి ఎటెళ్ళాడో! గొల్లది నిన్ననే పాలీయలేదు. ఎందు కిస్తుందీ? మనకు పెట్టే అప్పు ఏడు జన్మలకైనా తీరుతుందన్న ఆశ ఉంటేనా? పాపం, బీద ముండ, ఎక్కణ్ణించి తెస్తుందీ!" అంటూ ప్రారంభించింది.

ఆవిడ నోరు మంచిగా మూయటం జాహ్నవితరం కాదు. ఆవిడ కేకలకు సతి నిద్రలేచి, అంట్లు తోమటానికి కూర్చున్నది.

పదహారేళ్ళవాడు. హరిశంకరుడు తండ్రివద్దకు వచ్చి తనకు చెప్పులు కావాలనీ, వెంటనే ఇవ్వకపోతే బడికి వెళ్ళననీ మోరాయించాడు.

"పేదకొంపలో పుట్టినవాడి కీ బాబూగిరీ ఏమిటి? న న్నెక్కడన్నా కన్నం వెయ్యమన్నావా?" అన్నాడు తండ్రి.

"అంత చాతగానివాళ్ళు పిల్లల్ని కనటం దేనికీ?" అన్నది వదినెగారు.

మూడేళ్ళవాడు కాశీశంకరుడు వచ్చి తల్లి కొంగుపట్టుకుని ఆకలవుతున్న దన్నాడు.

రామశంకరుడు పైబట్ట వొంకెనుంచి తీస్తూంటే భార్య ఎక్కడికని అడిగింది.

"ద బ్బేర్పాటు చెయ్యగలిగితే తిరిగి వస్తా లేకపోతే ఇంతే." అంటూ భట్టాచార్యుడు ఇంటినుంచి బయలుదేరాడు.

జాహ్నవి దిగులుగా పెద్దకొడుకుతో, "వెళ్ళారా, హరి! ఆయన్ను వెనక్కి తీసుకురా, బాబూ," అన్నది


"ఎక్కడికి కెళతాడు? తిరిగి తిరిగి తానే వస్తాడు. నేను చాంద్‌పూర్ నరేన్ దగ్గిరికి పోతున్నా. అక్కడే ఉండమని బలవంతం చేస్తున్నాడు నరేన్. మిమ్మల్ని గురించి అలా జేశాను నేను. ఇక ఇక్కడ ఉండను. ఈ ఇంట అన్నం తిన్నవాడు ఛండాలుడు!" అని హరి వెళ్ళిపోయాడు...

ఇంటినుంచి బయలుదేరి, గమ్యమంటూ లేకుండా, చేలకు అడ్డంపడి పోతున్న రామశంకరుడుకు విశ్వేశ్వర మైత్ర ఎదురుపడి, "ఎక్కడి కిలా వెళుతున్నారు, బాబూ?" అని అడిగాడు.

"యమలోకానికి," అంటూ భట్టాచార్యుడు ముందుకు సాగాడు.

విశ్వేశ్వరు డాయనకు అడ్డంతగిలి, "నావల్ల కాదగిన ఉపకార మేదైనా ఉంటే చెప్పండి," అన్నాడు.

"నువ్వు యోగ్యుడివే. కాని, నే నెవరికి సహాయం చేశానని ఇతరుల సహాయం పొందను?" అన్నాడు భట్టాచార్యులు.



విశ్వేశ్వరు డాయనను తారాపూరు ఫ్యాక్టరీకి తీసుకుపోయి అక్కడ ఒక చిన్న ఉద్యోగ మిప్పించాడు.

విశ్వేశ్వరుడు నారాయణచంద్రమైత్ర కుమారుడు. వాళ్ళ గ్రామంలో వారిని మించిన ధనవంతులు లేరు. అతను తండ్రికి ఏక సంతానం. తల్లి పోయాక పినతల్లి అన్నపూర్ణ వచ్చి వారింటనే ఉంటున్నది. ఆమె దగ్గరకూడా చాలా డబ్బు ఉన్నట్టు చెప్పుకునేవారు.

తండ్రి విశ్వేశ్వరుణ్ని దూరం వెళ్ళనివ్వక తమ గ్రామంలో ఉన్నంతవరకే చదివించాడు. కాలేజీకి వెళ్ళకపోయినా అతనికి అపార పాండిత్యం ఉన్నది. పదిహేనో ఏట మెట్రిక్ ప్యాసై తనలైబ్రరీలో జొరబడి ఏడేళ్ళూ అక్కడే ఉండి పోయాడు అతని గ్రామంవాళ్ళకే అతనిముఖం సరిగా తెలీదు కొడుక్కి పెళ్ళి చేసి తాను కాశీకి పోదామనుకుంటూ నారాయణచంద్రమైత్ర హఠాత్తుగా మరణించాడు. అది మొదలు విశ్వేశ్వరుడుకి పిన్నితప్ప మరెవరూ లేరు

తండ్రి పోయిన అనంతరం అతను కొంచెం కొంచెంగా ప్రపంచంలో పడి, అది తా ననుకున్నంత భయంకరమైనది కాదని తెలుసుకున్నాడు. అతను ఇంటి పనులూ, పొలంపనులూ, తోటా చూసుకుంటూనే ఊరిపనులు కూడా చేయించ సాగాడు. గ్రామదేవత మందిరం బాగయింది. పెద్దచెరువు పూడిక తీశారు. అయితే తాను విశేషంగా డబ్బు ఖర్చు చేసి గొప్పపనులు చేయిస్తున్నట్టు నలుగురూ అనటం అతని కిష్టంలేదు.

ఉన్నట్టుండి అన్నపూర్ణమ్మకు విశ్వేశ్వరుణ్ని ఒకయింటివాణ్ని చేయాలని

కోరిక కలిగింది. పిల్లను చూసివస్తా నన్నది. ఒకతెను చూడట మేమిటి? కావలిసి నంతమందిని చూడమన్నాడు విశ్వేశ్వరుడు.

"పిచ్చిమాటలు చాలించి సరిగా చెప్పు. పెళ్ళిచేసుకుంటావా, లేదా ?" అన్నది పిన్ని. ఆమె కమల సంబంధంగురించి ప్రస్తావించింది. కాని విశ్వేశ్వరుడు వినిపించుకోలేదు. అతనికి పెళ్ళి చేసుకోవాలనే కోరిక ఏకోశానా లేదు.

ఆరోజు సాయంకాలం అతను అరటితోటనుంచి తిరిగివస్తుండగా నీళ్ళు తెస్తూ సతి ఎదురుపడింది. ఆమె అతనితో ఏదో మాట్లాడా లనుకున్నట్లు కనపడింది

"ఎవరి పిల్లవమ్మాయీ ?" అని అతనడిగాడు.

"భట్టాచార్యులుగా రమ్మాయిని "

"నిన్ను చాలాసార్లు చూశాను. జమీందారుగారి రేవుకు సాయంత్రంపూట వస్తూంటావు కదూ ?"

"అవును ఆరేవులోనే కమలను మీరు కాపాడారు "

"కమలా ? ఎవ రా కమల ?"

"జమీందార్ల పిల్ల. మీ రామెను నీళ్ళలో మునగకుండా బయటికి తీశారు. జ్ఞాపకంలేదా ?"

"ఏనాటిమాటో! ఆపిల్ల పేరు కమలా ?" అంటూ విశ్వేశ్వరుడు నవ్వాడు.

"అయితే మీరు కమలను పెళ్ళిచేసుకోవడంలేదా ?" అన్నది సతి.

"ఏం ? ఆమె కేమీ సంబంధం రాలేదా ?"

"రాకేం ? చాంద్‌పూర్ జమీందారుగా రబ్బాయి సంబంధం వచ్చింది. కాని కమల చేసుకోదు."

"చేసుకోదూ ? ఏం ?"

ఈ ప్రశ్నకు సతి సమాధానం చెప్పలేకపోయింది. చిన్నపిల్లలు సరదాగా అనుకునేమాటలే సతి తనతో అంటున్నదనుకుని విశ్వేశ్వరుడు గట్టిగా నవ్వుతూ, "ఆ సంబంధమే చేసుకోమని కమలకు చెప్పు. మనమంతా పప్పుణ్ణాలు తిందాం," అన్నాడు.

"అయితే మీరు చేసుకోరా ?"

"చూడూ, నేను పెళ్ళికొడుకునైతే ఉపవాసం ఉండాలి. విందుభోజనం ఉండదు."

"మీరు వేళాకోళం చేస్తున్నారు."

"కాదు ఎంత వద్దనుకున్నా మనసు పప్పుణ్ణాలమీదికే పోతోంది...నీ పేరేమిటమ్మాయీ ?"



"సతి." అంటూ ఆమె ఇంటిదారి పట్టింది.

ఆమెతో మాట్లాడా లనిపించి విశ్వేశ్వరుడు. "మీ అన్న తిరిగివచ్చాడా? మీ నాన్నగారు ఫాక్టరీకి వెళ్ళి పని చేస్తున్నారా?" అంటూ ప్రశ్న లడిగాడు. సతి వెనక్కి తిరిగి చూడకుండానే సమాధానాలు చెప్పి, గబగబా వెళ్ళిపోయింది.

*　　　*　　　*　　　*

రామశంకరభట్టాచార్యులు ఉద్యోగం చేసి, నెలకు పదిరూపాయలు తెచ్చి తన బాధ్యత తీరిందనుకుని నిశ్చింతగా గుడుగుడు తాగుతున్నాడు, భోంచేస్తున్నాడు. నిద్ర పోతున్నాడు.

పెద్దకొడుకు హరిశంకరుడు చాంద్‌పూర్ జమీందార్ల ఇంటనే ఉంటూ, సరదాకు వాళ్ళు ఏర్పాటు చేసిన నాటకసమాజంలో ఆడవేషాలు వేస్తూ, నెల కొకటి రెండురోజులు ఇంటిదగ్గిర ముఖం చూపించి వెళ్ళిపోతున్నాడు. ఆ ఇల్లంటే వాడికి అసహ్యం. వాడు జుట్టూ, కట్టూ, చేతికర్రా, వాలకమూ చూసి తల్లీ చెల్లెళ్ళు కంట తడిపెట్టేవాడు.

ఆ ఆడవాళ్ళ ముగ్గురికీ విశ్రాంతి అన్నది లేదు. ఇంటిపనులు లేని వేళలో జంధ్యాలు వడికేవాళ్ళు; గాళ్ళు పేనేవాళ్ళు; జాహ్నవి కుట్టుపనికూడా చేసేది. పది రూపాయలతో సంసారం గడవదు. ఆడవాళ్ళు కష్టపడి కొద్దిగా సంపాదించేవారు. ఖర్చులు పోగా కాస్త వెనకవేద్దామని వాళ్ళ తాపత్రయం. వచ్చేరోజులు గడ్డు రోజులు. భట్టాచార్యులు రోగిష్టి. పిల్లలిద్దరూ చక్కని చుక్కలు. అయితే నేం? వారికి పెళ్ళిళ్ళు అయేదారి కనబడదు. డబ్బుంటే అందం లెక్కలోకి రాదుగాని, అందం దారిద్ర్యాన్ని కప్పిపెట్టలేదు.

కమల అత్తవారింటినుంచి పుట్టింటికి వచ్చిందని విని సతి ఆమెను చూడటానికి తన తమ్ముణ్ణి వెంటబెట్టుకుని వెళ్ళింది. వాళ్ళు ఒకరినొకరు చూసుకుని రెండేళ్ళయింది. కమల తనకష్టాలు చెప్పుకున్నది; ఆమెను అత్తవారు పుట్టింటికి పెళ్ళనివ్వరు.

"నీ పెళ్ళిమాటేమిటే, సతీ? ఇంకెన్నాళ్ళు పెళ్ళిలేకుండా ఉంటావు?"

"అనగానే పెళ్ళవుతుందా, కమలా? పెళ్ళిప్రయత్నాలతో అమ్మకూ, నాన్నకూ మతిపోయింది. ఉన్న ఇల్లమ్మేసి చెట్టుకింద కాపరం పెట్టందే నావంటిదానికి పెళ్ళవుతుందా?"

కాస్సేపు మాట్లాడి సతి తమ్ముణ్ణెత్తుకుని ఇంటికి తిరిగివచ్చింది. వెంటనే పెత్తల్లి ఉచ్చస్వరంలో అందుకుంది. "పద్దాలుగేళ్ళొచ్చాయి, గేదిలాగుంది, గొప్పవాళ్ళ ఇళ్ళచుట్టూ తిరిగిరానిస్తున్నారు! సిగ్గులేదు!"

ఆ రాత్రి రామశంకరభట్టాచార్యుడు భోజనం చేస్తుండగా ఆయన వదినెగారు పెద్దగా అరుస్తూ, "అవతల ఆడపిల్లలెదిగివచ్చారు. ఒకతె పద్నాలుగేళ్ళది. ఇంకొకత్తె పన్నెండేళ్ళది — ముద్ద ఎలా మింగుడుపడుతున్నదా అని!" అన్నది.

"ఏం చెయ్యాలి? డబ్బులేందే ఆడపిల్లలు వదలరే!" అన్నాడు రామశంకరుడు.

"అలాటప్పుడు పిల్లల్నెందుకన్నారో?"


"అదంతా ఇప్పుడెందు. కర్మ!" అన్నది జాహ్నవి మంచిగా.

"అవునులే. అందుకే నే నీ యింటో ఉండను. నన్ను పోనీండి. మధ్య నా కేం బాధ్యత? నా తల కెవరూ సున్నదొట్లు పెట్టరు! నను చూసి ఎవరూ నవ్వరు." అన్నది జాహ్నవి తోడికోడలు.

భట్టాచార్యుడు అన్నంవిడిచి లేచివెళ్ళాడు. ఆపూటెవరికీ అన్నాలు సయించలేదు.

* * * *

అన్నపూర్ణ సావిత్రీవ్రతం చేసి, విందు చేసి బ్రాహ్మలకు తాంబూలంతో దక్షిణా, యజ్ఞోపవీతాలూ ఇచ్చి, విశ్వేశ్వరుణ్ణి ఆశీర్వదింపజేసింది.



ఆడవాళ్ళకు వేరే విందు జరిగింది. జాహ్నవి తన కూతుళ్ళిద్దరితోను వచ్చింది. అన్నపూర్ణ అంతసేపూ సతికేసే చూస్తూ ఉంది. తల్లికూతుళ్ళు తాంబూలాలు తీసుకుని బయలుదేరేటప్పుడు, "కాస్సేపు కూర్చో. వదినా. నెమ్మదిగా వెళ్ళొచ్చులే."

అందరూ వెళ్ళాక అన్నపూర్ణ జాహ్నవి దగ్గిరనే పీటవేసుకు కూర్చుని సతిని గురించి అడిగింది. పిల్ల వయసెంత? ఇంకా పెళ్ళి కాలేదేం? ఇంత చక్కనిపిల్లను ఎవరైనా కళ్ళ కద్దుకుని చేసుకుని ఉండవచ్చునే! చిట్టచివర కామె. "మా విషకు ఇటువంటి పిల్ల దొరికితే ఎంత బాగుణ్ను!" అన్నది.

"విషు కేమిటి. వదినా! దీనికన్న మంచిపిల్లలే వస్తారు." అన్నది జాహ్నవి.

"నీ కూతుళ్ళు బుద్ధిమంతురాళ్ళని వినటమేగాని వాళ్ళను చూడనేలేదు. మీ పెద్దమ్మాయిని మా కియ్యి. వదినా."

"మాదాని కంత అదృష్టమా!" అన్నది జాహ్నవి ఈ మాటలు వింటున్న సతికి ముచ్చెమటలు పోశాయి. పొద్దుపోయిందని జాహ్నవి లేచింది.

"నా మాట కేం చెప్పావు? సతిని మా కియ్యవా?" అన్నది అన్నపూర్ణ.

"మాసతికి అంతకుమించి అదృష్టం ఉంటుందా? కాని విషుకూడా ఒప్పుకోవాలిగా?"

"వాడు సతిని ఒప్పుకోకపోతే వాడికి పెళ్ళిగీత లేదనుకోవలిసిందే. కాని ఈ సంగతి ఇప్పటి కెక్కడా అనవద్దు. మావాడు ఎలాటివాడో నీకు తెలీదు. ఒకటి రెండు నెలల్లో వాణ్ణి పెళ్ళికి ఒప్పిస్తాను. నీ కిప్పుడే మాట ఇస్తున్నాను."

ఇంటికి వస్తూనే జాహ్నవి ఈ విషయం భర్తకు చెప్పింది.

"అయితే పిల్ల పెళ్ళికి ఇల్లమ్మక్కర్లేదు. విశ్వేశ్వరుడు దమ్మిడీ అడగడు. పెళ్ళిఖర్చులకు అప్పుచేసి నింపాదిగా తీర్చుకోవచ్చు." అన్నాడు భట్టాచార్య డాశగా.

రెండుమూడు రోజులు గడవనిచ్చి అన్నపూర్ణ సతినీ, సావిత్రినీ భోజనానికి పిలిచింది. విశ్వేశ్వరుడు భోజనానికి సిద్ధమైవచ్చి, వాళ్ళను చూసి, "ఎవరి పిల్లలు పిన్నీ?" అని అడిగాడు.

"చెప్పుకో చూస్తాం." అన్నది అన్నపూర్ణ.

సతి సిగ్గుపడి తల వంచుకున్నది. సావిత్రికూడా కొంచెం సిగ్గుపడింది.

"ఈ అమ్మాయి సతి. నాకు తెలుసు. కాని ఆ అమ్మా యెవరు?" అన్నాడు విశ్వేశ్వరుడు.

"సతిచెల్లెలు. పిల్ల లెలా ఉన్నారు?"

"చాలా అందంగా ఉన్నారు, పిన్నీ."

"నువ్వు వాళ్ళతో మాట్లాడుతూ ఉండు. నేను వడ్డిస్తా," అంటూ అన్నపూర్ణ అవతలికి వెళ్ళింది. విశ్వేశ్వరుడు వాళ్ళతో మాట్లాడాడు. సావిత్రి కొంచెం అడిగిన మాటకు చెప్పిందిగాని, సతినోట మాటే రాలేదు.

వాళ్ళు భోజనాలయి వెళ్ళాక అన్నపూర్ణ విశ్వేశ్వరుణ్ణి, "ఇద్దరిలో ఎవ రెక్కువ బాగున్నారు?" అని అడిగింది.

"నే నంత బాగా చూడలేదు. ఎందు కలా అడిగావు?"

"నా కళ్ళు సతికి అంటుకుపోయావనుకో. పాపం, వాళ్ళు బీదవాళ్ళుకనక కట్నం పోసి పిల్లకు పెళ్ళి చెయ్యలేకుండా ఉన్నారు."

"నువు వాళ్ళకు డబ్బియ్యి పిన్నీ! పాపం, మంచిపిల్లలు!"

"చెప్పావులే బోడి సలహా. డబ్బుంచేమాత్రం తగినవరుడు దొరకవద్దురా?"

"అవును పిన్నీ. మంచి వరుడికోసం చూస్తాను. వరుడు దొరికితే నువు డబ్బిస్తావా?"

"ఏం బుద్ధిరాలేదీ!" అన్నది అన్నపూర్ణ కోపంగా. ఆమెకు కోపం ఎందుకు వచ్చిందో విశ్వేశ్వరుడి కర్థంకాలేదు.

మరొకనెల తరవాత విశ్వేశ్వరుడు భట్టాచార్యుడి ఇంటిపక్కగా పోతూ, కాశీ ఒక దూడతో ఆడుకుంటూంటే దానితల్లి వాణ్ణి పొడవరావటం చూసి, చప్పున కాశీని ఎత్తుకుని పక్కకు వెళ్ళాడు.

ఇంతలో సతి వచ్చి, విశ్వేశ్వరుణ్ణి చూసి కొంచెం కంగారుపడింది. పిల్లవాణ్ణి ఆవు పొడవవచ్చిందని చెప్పి అతను ఆమెకు పిల్లవాణ్ణి అందించబోతే సిగ్గుచేత ఆమె అందుకోలేదు. ఎవరైనా చూస్తే ఏమనుకుంటారో అని ఒక అడుగు వెనక్కి వేసింది. అతను పిల్లవాణ్ణి దించాక ఆమె ఎత్తుకుని అతనితో ఏమీ అనకుండా లోపలికి వెళ్ళింది.

కృతజ్ఞతాపూర్వకంగా సతి రెండుముక్కలు అనకుండా వెళ్ళిపోయినందుకు విశ్వేశ్వరుడు కొంచెం నొచ్చుకుని, అంతసిగ్గు ఎవరిలోనూ శోభించ దనుకున్నాడు. ఆమె తన విషయంలో సిగ్గుపడటానికి గల కారణం అతని కేమాత్రమూ తెలీదు.

మరికొంతకాలం గడిచాక అన్నపూర్ణ ఒకనాడు విశ్వేశ్వరుడితో, "నీకు పెళ్ళి నిశ్చయించాను. పైమాసంలో సతికీ, నీకూ పెళ్ళి చేస్తాను," అన్నది.

విశ్వేశ్వరుడు కొయ్యబారిపోయాడు. "నా పెళ్ళికి ఇంత కాలం ఆగావు; ఇంకొక్క సంవత్సరం ఆగు!" అన్నాడు.

"అనవసరంగా గొడవపడుతున్నావు. వాళ్ళు పిల్లను ఇంకో ఏడాది ఆపి ఉంచరు; అంతకన్న మంచిపిల్ల నీకు దొరకదు. వాళ్ళకు మాట ఇచ్చాను. నువ్వు పెళ్ళికి ఒప్పుకోకపోతే నేను వాళ్ళకు మొహం చూపలేను. ఎక్కడికైనా పోతాను," అన్నది అన్నపూర్ణ.

"నువు వెళితే నేనూ వస్తాను. సతికి నాకన్న మంచిమొగుణ్ణి నేను తెస్తాను. డబ్బుకూడా ఇద్దాం," అన్నాడు విశ్వేశ్వరుడు.

"సతిని వదులుకుంటున్నావు. తరవాత పశ్చాత్తాప పడతావు," అన్నది అన్నపూర్ణ దిగులుగా.

పిన్ని చాలా బాధపడుతున్నదని తెలిసికూడా అతను తన మనస్సును వివాహానికి అనుకూలంగా మార్చుకోలేకపోయాడు. అతనికి పెళ్ళంటే ఏకోశానా ఇష్టం లేదు.

మర్నా డతను భట్టాచార్యు డింటికి వెళ్ళి, తాను సతికి మంచి మొగుణ్ణి వెతుకుతా నన్నాడు.

"ఇప్పటికే నీకు చాలా రుణపడి ఉన్నాను బాబూ. ఇంక దాన్ని పెరగనివ్వకు.

నా కూతురి బరువు నేను మోస్తానులే. నువ్వు నిశ్చింతగా ఉండు." అన్నాడు రామశంకరభట్టాచార్యుడు.

విశ్వేశ్వరుడు హతాశుడై ఇంటికి వచ్చి, పిన్నికి జరిగినది చెప్పాడు.

"నేను వారి ముఖం చూడలేను; కొన్నాళ్ళు కాశీలో ఉంటానురా; నన్ను కాశీకి పంపు." అన్నది అన్నపూర్ణ.

అన్ని ఏర్పాట్లూ చేసి విశ్వేశ్వరుడు పిన్నిని రైలెక్కించి, ఆ రైల్లోనే తానూ ఎక్కాడు.

"నువ్వెక్కడికిరా ?" అన్నదామె.

"నువ్వెక్కడికో నేనూ అక్కడికే." అన్నాడు విశ్వేశ్వరుడు.

*　　*　　*

నిండా మునిగినవాడికి చలిబాధలేదు. రామశంకరుడు సతికి పెళ్ళి చేసి నిశ్చితుడయాడు. నవగ్రామానికి చెందిన బ్రాహ్మడొకడు మూడువందల రూపాయలు పుచ్చుకుని, సతిమెడలో మూడుముళ్ళూ వేసి తనదారిన తాను చక్కాపోయాడు. పెళ్ళిగాని పిల్లలకు తాళిగట్టి, వారి తండ్రుల వంశాలను "కాపాడి", డబ్బు పుచ్చుకోవటం అతని వృత్తి. సతికి భర్తతో కాపరమంటూ లేకపోయినా పరువు దక్కింది.

మూడువందలూ తేవటానికి రామశంకరుడు ఇల్లు తాకట్టు పెట్టాడు. అప్పు తీరేదికాదు. అందుచేత ఎలా తీరుస్తామా అన్న విచారంకూడా లేదు. రామశంకరుడిప్పుడు సతిని చూస్తేచాలు తిట్టి తరిమేస్తాడు. పెద్దకొడుకు హరి ఎప్పుడైనా కనిపిస్తే వాణ్ణికూడా శాపనార్థాలు పెడతాడు. చిన్నవాణ్ణి కొడతాడు.

సతి పెళ్ళి అయిదారుమాసాలయింది. రామశంకరుడు ఫాక్టరీకి నాగాలేకుండా పోతున్నాడు, వస్తున్నాడు.

ఒకరోజు సాయంకాలం పెద్దపెట్టున మేఘాలు కమ్మి, గాలివాన సాగింది. ఆ గాలివానలో రామశంకరుడు ఆలస్యంగా ఇంటికి వచ్చి వాకిలికి అవతల పడిపోయాడు. తల్లి కూతుళ్ళు ఆయనను లోపలికి మోసుకొచ్చి, తడిబట్టలు విప్పి, పరుపుమీద పడుకోబెట్టారు.

స్పృహ లేకుండా ఉన్న తండ్రిచేత సతి కాచినపాలు ఆలిచిప్పతో తాగించింది. కొంతసేపటి కాయన కళ్ళు తెరిచి సతిని చూసి ఎక్కడలేని శక్తీ తెచ్చుకుని, సతిని బలంగా తోసేస్తూ, "పో, అవతలికి పో. సర్వనాశనం చేశావు ? ఇంకేం కావాలి నీకు. నన్నుకూడా మింగుదామనుకుంటున్నావా ?" అని ఉద్రేకంతో అన్నాడు.



జాహ్నవి దగ్గిరికి వచ్చి. "ఎలా ఉంది? కాస్త తేలికగా ఉందా?" అన్నది.

"ఎలా ఉందా? కనబడటంలేదూ? అంతా ఇవాళతో చెల్లు. నేను బతకను."

"అలా అనకూడదు, నాన్నా." అంటూ సావిత్రి ఏడ్చింది.

నేను పోతే మీ కేం నష్టం? నే నేం నాన్నను? నాన్నగా మీ కేం చేశాను? నేను లేకపోతే మీరు పెద్దవాళ్ళు కాలేకపోతారా? బతికుంటే నీకూ్కడా ఇంకో చావ సిద్ధంగా ఉన్నవాడిచేత మూడుముళ్ళూ వేయించి ఉందునేమో!" అంటూ రామ శంకరుడు తిరిగి అపస్మారంలో పడ్డాడు.

తిరిగి స్పృహ తెలిశాక ఆయన ఒక్కొక్కరినే దగ్గిరికి పిలిచి ఆశీర్వదించాడు. దగ్గిరలేని హరినికూడా ఆశీర్వదించాడు

"అక్కనుకూడా ఆశీర్వదించు, నాన్నా." అన్నది సావిత్రి.

"అక్కనా? చచ్చిపోతూ కూతుర్ని ఎగతాళి చెయ్యనా, అమ్మా?" అంటూ ఆయన సతిని, "దగ్గిరికి రా, తల్లీ. నిన్ను హత్య చేశానమ్మా! నిన్నేమని ఆశీర్వదించను?" అన్నాడు.

ఆయన మాట్లాడుతూనే కళ్ళుమూసుకుని నిద్రపోయాడు. తెల్లవారుజామున గురక ఆరంభమయింది. సావిత్రి వెళ్ళి డాక్టరును తెచ్చింది. రోగిని చూసి డాక్టరేమీ అనకుండా, రెండు మోతాదులు మందిచ్చి ఫీజుకూడా అడగకుండా వెళ్ళిపోయాడు. తెల్లవారకుండానే రామశంకరభట్టాచార్యుడు పోయాడు.

ఊళ్ళో ఉండే యువకులు ఉత్తరక్రియల ఏర్పాట్లు చేశారు. తండ్రి తలకింద కొరివి పెట్టటానికి హరికూడా లేడు. నాటకాలు చూడటానికి కలకత్తా వెళ్ళాడు. ఆ పని జాహ్నవి చెయ్యబోతూ మూర్ఛపోయింది. ఆమెకు స్నానం చేయించి ఇంటికి తెచ్చారు.

ఫాక్టరీవాళ్ళు రామశంకరుడి జీతం పంపారు. కర్మ చేసే భారం ఆరేళ్ళ కాళీపైన పడింది. వాడు ఉపవాసం ఉండి తండ్రికి కర్మ చేశాడు. ఊళ్ళోవాళ్ళు చేసిన ధన సహాయంతో నలుగురు బ్రాహ్మణులకు మాత్రమే సంతర్పణ చేసి రామశంకరుడి ఆత్మకు ఆకలి దప్పులు లేకుండా చేశారు.

* * * * *

జమీందారుగారి నాటక సమాజం "దుర్గేశనందిని" నాటకం ఆడాలని తలపెట్టారు. అందులో హరి ఆయిషా వేషం కడుతున్నాడు. ఆ నాటకమే కలకత్తాలో పడుతున్నది. దాన్ని చూడటానికే హరి కలకత్తా వెళ్ళి, శ్రాద్ధానికిముందే తిరిగి వచ్చాడు. శ్రాద్ధంనాడే నాటకప్రదర్శనం కావటంచేత జమీందార్లు తండ్రి మరణ వార్త వానికి తెలియకుండా దాచిపెట్టారు. ఆ వార్త పత్రికలలో పడేటంత ముఖ్యమైనది కాదాయె. నాటకం సవ్యంగా జరిగింది. ఆయిషా పాత్రను అందరూ మెచ్చుకున్నారు.

ఆ ఆనందంలో హరి ఇంటికి బయలుదేరితే జమీందార్లు వెళ్ళనిచ్చారు. అప్పటికి రామశంకరుడు పోయి పదిహేనురోజు లయింది. ఆయన భార్యా బిడ్డలకు ఏడుస్తూ కూర్చోవటానికి కూడా లేదు. తాళ్ళు పేనే నార తీసి నీటిలో నానబెట్టారు. మంచం కిందనుంచి రాట్నం పైకి తీశారు.

హరి తమ ఇంటి ఆవరణలోకి అడుగుపెట్టి, "నాన్నా,' అని పిలిచేసరికి పతీ సావిత్రుల చేతులో ఉన్న వస్తువులు కాస్తా కిందపడ్డాయి జాహ్నవి ఒకసారి కళ్ళు తెరిచి హరిని చూసి మళ్ళీ మూసుకున్నది. పెత్తల్లి మటుకు హరికి ఎదురు వెళ్ళి, ఏడుస్తూ, "మీ నాన్న లేడురా, నా తండ్రీ! ఆయన వెళ్ళిపోయి పదహారురోజు లయిందిరా! తండ్రికి కొరివీ పెట్టక, పిండమూ వెయ్యని కొడుకువై పుట్టావురా!" అన్నది.

హరి కుప్పకూలిపోయాడు. విధవవేషంలో నీరసించి ఉన్న తల్లిని చూడటం అతనికి చాలా బాధ అయింది. అతనికి జమీందార్ల మీద అసహ్యం పుట్టింది. వాళ్ళ దగ్గిరికిక పోరాదనుకుని కొన్నాళ్ళు ఇంటివద్దనే ఉన్నాడు. కాని నాలుగురోజు లయాక అతను తన చెల్లెలితో, "సతీ, నే నిలా ఇంట కూర్చుంటే రోజులు గడవ్వు. వెళ్ళి ఏదన్నా పని చూసుకుంటాను. ఇవిగో పదిరూపాయలు. వీటితో జరుపుతూ ఉండు. డబ్బు అవసరమైతే చాంద్‌పూర్ జమీందార్ల ఇంటికి కబురుచెయ్యి. నేను పోతాను," అని, తల్లితోనైనా చెప్పకుండా వెళ్ళిపోయాడు.

*　　　　*　　　　*

మూడు నెలలు గడిచాయి. ఈ లోపల హరి ఒకసారి ఇంటికి వచ్చి కొంత డబ్బిచ్చి వెళ్ళాడు. ఆ డబ్బుకు తమ కష్టార్జితం జతచేసి ఆడవాళ్ళు గడుపుకొస్తున్నారు.

ఒకరోజు వాళ్ళ కొకకార్డు వచ్చింది. తులసికోట అలుకుతున్న జాహ్నవి ఆ కార్డు చదువుకుని, అక్కడే చతికిలబడి వణికిపోసాగింది. తల్లిని చూసి కంగారు పడుతూ వచ్చి సతి తానుకూడా కార్డు చదువుకున్నది. ఆమె మెడలో తాళి కట్టిన వాడు పరమపదించాడు, ఉత్తరక్రియలు విజయవంతం చెయ్యడానికి బంధువులతో సహా రావలసిందని తన సవతితల్లిని కోరుతూ చనిపోయినవాడి కొడుకు రాశాడు.

ఉత్తరం చూసి సతి దుఃఖించలేదు గాని సావిత్రి ఏడ్చింది. సావిత్రిని చూసి తల్లికూడా ఏడ్చింది. సతి ఏడుపంతా పెళ్ళినాడే ముగిసింది; ఇప్పుడీ ఏడుపులు ఆమెకు వేళాకోళంగా కనిపించాయి. మొగుడు పోతే ఆమె కంట తడి పెట్టనందుకు అందరూ ఆక్షేపించారు.

సతి శాస్త్రోక్తంగా నదీస్నానం చేసి, గాజులు తానే చిట్లగొట్టుకుని, మల్లుబట్ట కట్టుకుని, బొట్టు లేకుండా ఇంటికి తిరిగివచ్చి, రెండు వేపాకులు నమిలి, అగ్నిహోత్రం ముట్టుకుని, లోపలికి అడుగు పెట్టింది. ఆమె వైధవ్య రూపం చూసి తల్లీ చెల్లెలూ గొల్లున ఏడిచారు.

అన్నపూర్ణా, విశ్వేశ్వరుడూ ఒక ఏడాదిపాటు తీర్థాలు సేవించి తిరిగి వచ్చారు. వాళ్ళు రైల్లో ఉండగానే అన్నపూర్ణ," విషూ, ఇంటికి పోయిన నెలలోగా నీకు పెళ్ళి చేస్తాను చూసుకో," అన్నది. విశ్వేశ్వరుడు నవ్వాడు.

అతనికి పెళ్ళి అంటే భయం మొట్టమొదట ఎలా ఏర్పడిందో తెలీదుగాని, అది ఇప్పు డతని మెదడులో బాగా వేళ్ళు తన్ని కూర్చున్నది. తల్లీ, అక్కచెల్లెళ్లాలాటి వాళ్లు లేకపోవడమూ, అస్తమానమూ పుస్తకాలు చదివి, మగవాడి జీవితానికంతకూ ఆడదే మూలాధార మనుకోవటమూ, స్త్రీ వ్యామోహంలో మగవాడు అవివేకి అయి పోతాడని వినటమూ మొదలైనవి అతన్ని అలా తయారు చేశాయి.

సాయంకాలంవేళ వా రిల్లు చేరారు. అన్నపూర్ణ వంట ప్రారంభించింది. విశ్వే శ్వరుడు ఊళ్లో నలుగురినీ పలకరించటానికి బయలుదేరాడు. గ్రామస్థులు "ఎప్పుడు రావటం బాబూ?" అని అడిగితే అతనికి పరమానందంగా ఉంది. ఒకప్పు డెవరి తోనూ జోక్యం పెట్టుకోనివాడికి ఇప్పుడు ప్రతి గ్రామస్థుడిపైనా స్నేహభావం కలిగింది. అతను పొద్దుపోయి తిరిగి వచ్చేసరికి అన్నపూర్ణ వంట పూర్తిచేసి చాలా సేపైంది.

"ఇంతసే పెక్కడ ఉన్నావురా? గ్రామంలో అందరూ క్షేమమేనా?" అన్నది అన్నపూర్ణ.

"మన శంకరభట్టాచార్యుడు పోయాడు."

"అయ్యో, పాపం! పోయాడేమో సుఖపడ్డాడు బ్రాహ్మడు."

మర్నాడు ఉదయం అన్నపూర్ణ స్నానానికి ఏటికి వెళ్ళి, అక్కడ జాహ్నవితో బాటు వితంతువు రూపంలో ఉన్న సతినికూడా చూసి కొయ్యబారిపోయింది.

తీర్థయాత్రలనుంచి తిరిగి వచ్చాక అన్నపూర్ణా, విశ్వేశ్వరుడూ కూడా మారి పోయారు. అన్నపూర్ణ మన్నుతిన్న పాములా గుంటున్నది. ఆమె ఇక విశ్వేశ్వ రుడి పెళ్ళిమాట ఎత్తననీ, అతను తన యిష్టం వచ్చినప్పుడే పెళ్ళి చేసుకోవచ్చు ననీ అన్నది.

విశ్వేశ్వరుడు వెనకటిలాగా పుస్తకాలలో నిమగ్నుడై కాలక్షేపం చెయ్యలేకుండా ఉన్నాడు. ఒకనా డతను, "పిన్నీ, వా ళ్ళిప్పు డెలా ఉన్నారో విచారించావా?" అన్నాడు.

"వాళ్ళకు చేసింది చాలక, వాళ్ళ కిష్టాలు చూసి ఆనందించబోవటానికి నా కేమన్నా మతిపోయిం దనుకున్నావా?" అన్నది అన్నపూర్ణ.

"వా ళ్లింటికే వెళ్ళాలా? ఇతరుల నడిగితే చెప్పరా?"

"వాళ్ళ సంగతి నీకు తెలీదు. తాము కష్టాల్లో ఉన్నట్టు అందరికీ చెప్పుకునే రకంకాదు. సహాయం యాచించే రకంకాదు. హరి అప్పుడప్పుడూ వచ్చి పోతున్నాట్ట."

"హరా ? వాడు ఏనాడో పతనమైనాడు. చాంద్‌పూర్ జమీందారు నరేన్ లేడూ- మన జమీందారుగారి అల్లుడు ! వాడూ, హరీ గుర్రా లెక్కి గాలప్ చేస్తూపోవటం చూశాను. హరికూడా జమీందార్ల దుస్తులే వేసుకున్నాడు. ఛీ ఛీ. వాడికి సిగ్గుకూడా లేకుండా పోయింది."

"వాడి వేషం చూసే కాబోలు, వాళ్ళకు బాగానే జరుగుతున్నదని అందరూ అనుకుంటున్నారు."

భట్టాచార్యుల కుటుంబంవాళ్ళు కష్టాలలో ఉన్నారనీ, వాళ్ళకు ఏలాగైనా సహాయం చెయ్యాలనీ విశ్వేశ్వరుడు నిశ్చయించుకున్నాడు. కాని అది సులభంకాదు. వాళ్ళు ఇల్లు వదిలి రారు. నీళ్ళకోసం బయలుదేరితే సావిత్రి ఎప్పుడైనా కనిపిస్తుంది గాని సతి అసలే కనబడదు. వారింటికి వెళ్ళటానికి అతనికి ముఖం చెల్లదు.

సావిత్రికూడా తప్పనిసరి అయితే తప్ప బయటికి రావటం లేదు. ఎందుకంటే, ఆమెను చూసినప్పుడల్లా అమ్మలక్కలు, "ఎద్నాలుగేళ్ళ పిల్ల. పాపం, పెళ్ళి ఎప్పుడవుతుందో. అక్కలాగా ఆమేకన్న పెళ్ళి కాకుండా ఉండటమే మేలు." అనీ, "అదేంమాట ? ఎలా రాసిపెట్టి ఉందో ఎలా తెలుస్తుంది ? అందుకొని ఎక్కడన్నా పెళ్ళి మానుకుంటారా ?" అనీ ఎవరి చిత్తం వచ్చినట్టు వాళ్లు అనేవాళ్లు.

విశ్వేశ్వరుడు సావిత్రిని కలుసుకోవటానికి మధ్యాహ్నంవేళ ఏటి ఒడ్డున తిష్ఠ వేశాడు. సావిత్రి బిందె తీసుకునివచ్చి, అతన్ని చూసింది.

"సావిత్రీ ! నీతో కొంచెం మాట్లాడాలి." అన్నాడతను. అతని ప్రశ్నలకు సమాధానంగా ఆమె, హరి అప్పుడప్పుడూ వస్తూంటాడనీ, అతనికి ఉద్యోగం ఉన్నదో లేదో తనకు తెలీదనీ అన్నది. అతనే సంసారం గడుపుతున్నాడా అని అడిగితే జవాబు చెప్పలేదు.

"మీ బంధువులాటివాణ్ణి. మీ యోగక్షేమాలు తెలుసుకుందామని అడుగుతున్నాను. మీ ఇంటి సమాచారాలు నాకు చెప్పగూడదా ?" అన్నాడు విశ్వేశ్వరుడు.

"మీ ఇంటి సమాచారాలు మీరు అందరితోనూ చెబుతారా ? నన్నెందుకడుగుతున్నారు ?" అన్నది సావిత్రి రోషంగా.

"అడిగితే చెప్పటం తప్పా ?"

"తప్పే. చెప్పి లాభమేమిటి ?"

"నీకు బాధ కలిగించటానికి అడగలేదు, సావిత్రీ! అయినవాడిలాగా ఆదుర్దాతో అడిగాను. నేను పరాయివాణ్ణే అయినా—"

అతను బాధపడుతున్నాడని తెలిసి సావిత్రి మెత్తబడి, "క్షమించండి, మా కష్టాలను గురించి అడిగారు. మా కిప్పుడు చెప్పుకోదగిన కష్టా లేవీ లేవు. రోజులు గడుస్తూనే ఉన్నాయి," అన్నది.

"రోజు లందరికీ గడుస్తాయి—కొందరికి అతికష్టంగా, మరి కొందరికి అతి సుఖంగా," అంటూ అతను విషాదంగా నవ్వాడు. అతను సావిత్రి కొంగున ఓవంద రూపాయలనోటు కట్టుతూ, దీన్ని అమ్మ కియ్యి, ఆమె రమ్మంటే వచ్చి మాట్లాడ తాను. పెద్ద బిందె మోస్తూ చాలాసేపు నిలబడ్డావు. ఇక ఇంటికి వెళ్ళు సావిత్రీ." అంటూ అతను వెళ్ళిపోయాడు.

మర్నాడు పొద్దున అతను పిన్నిదగ్గిరికి వెళ్ళేసరికి సావిత్రి పూలసజ్జతో కనిపించింది. ఆమె అతని ఆహ్వానంపైన అతనిగదిలోకి వచ్చి, బల్లమీదా, పుస్తకాల మీదా నాలుగేసి పూలుంచి, చీరె చెంగునుంచి అతని నోటు విప్పి బల్లమీద ఉంచి, "ఈ డబ్బు అవసరం లేదని అక్క అన్నది. మాకన్న కటికదరిద్రు లున్నారు. వారి కిస్తే ఎంతో సంతోషిస్తారు," అన్నది.


విశ్వేశ్వరుడు నిశ్చేష్టు డయాడు

* * *

జాహ్నవీ, ఆమె కూతుళ్ళూ అతిప్రయాసతో దారిద్ర్యాన్ని తోసుకుంటూ వస్తున్నారు. ఇల్లు, ఇటుకలు బయటపడి, అస్థిపంజరంలాగుంది. దొడ్డీ, అవరణా మాత్రం అలికి, శుభ్రంగానూ, అందంగానూ ఉంది. జాహ్నవి మనోవ్యాధితో కృషించింది. కాశీ చింకిచొక్కా వేసుకోటానికి నామోషీ అయి, చలికాలమైనా కూడా, చొక్కా లేకుండా తిరుగుతున్నాడు. వాడికి రోజూ పిప్పరమెంట్లు కావాలి.

ఈ యింటివాళ్ళు తయారుచేసిన జంరుూలూ, తాళ్ళూ, పండించిన కాయలూ, పళ్లూ శాంత అనే ఆమె అమ్మి, ఆ డబ్బుతో ఇంటికి కావలిసిన పప్పూ, ఉప్పూ, బియ్యమూ, పిప్పరమెంట్లూ తెచ్చి యిచ్చి, వాళ్ళ దీనస్థితి పదిమందికీ తెలియకుండా కొంతవరకు కాపాడుతున్నది; అవసరమైనప్పుడు కంచమూ, గిన్నె అమ్మి పెడుతూ ఉంటుంది; పాత్రసామగ్రి చాలాభాగం అయేపోయింది. సతి స్నానానికి వెళ్ళినప్పుడు వంటకు పనికివచ్చే ఆకు లేవేవో కోసి తెచ్చేది. పరిస్థితి మరీ ఘోరంగా ఉన్నప్పుడు హరి ప్రత్యక్షమై, కాసిని రూపాయ లిచ్చి, వెళ్ళిపోతూండేవాడు.

ఒకనాడు శాంత జమీందారుగారింట కూర లమ్మి వచ్చి, కమల వచ్చిందని



చెప్పింది. తల్లి అనుమతితో సతి కమలను చూడబోయింది. ఒకరిని చూసి ఒకర ఎంతో ఆవేదన పడ్డారు. కమల కృషించి దిగులుగా ఉన్నది. కమల సతిని పెళ్ళి కాకముందు చూసి, తిరిగి విధవ వేషంలో చూస్తున్నది.

"నా స్థితి ఏమీ మారలేదు. నేను వెనక ఉన్నట్టే ఉన్నాను. కాని నీ ముఖం అలా దీనమైపోయిందేమిటి కమలా?'' అన్నది సతి.

కమల సతిని కావలించుకుని ఏడుస్తూ, తన భర్తకు ఇప్పుడు తనతో అవసరం లేదనీ, పూల బతుకులాగే ఆడదాని బతుకుకూడా ఒక్కనాడే శోభించి తరవాత పెంటకుప్పమీదికి చేరుతుందనీ అన్నది.

కమల భర్త నరేన్ ఒకనాడు గుర్రంమీద పోతూ తనకేసి చూసిన చూపుతో తన శరీరం కంపరం ఎత్తటం సతికి జ్ఞాపజం వచ్చింది. ఆమె కమలవద్ద చప్పున సెలవు పుచ్చుకుని ఇంటికి బయలుదేరింది.

దారిలో విశ్వేశ్వరుడు కనిపించి పలకరించాడు. సతి మాట్లాడక పక్కకు తప్పుకుని, అతను వెళ్ళటానికి దారి ఇచ్చింది.

"సతి, మీ అమ్మకు డబ్బు పంపితే దాన్ని ఎందుకు తిప్పి పంపావు ?"

"అవసరం లేక."

"ప్రేమతో ఇచ్చినది అవసరంలేనంతమాత్రాన నిరాకరిస్తారా ?"

"మా పేదరికం చూసి సహాయపడదామనుకున్నారు. మేం పేదలమే అయినా, బిచ్చమెత్తటంకంటె మా స్వశక్తిపైన అధారపడటం మేలు కాదా ?"

"క్షమించు, సతీ! నేను బిచ్చం పెట్టలేదు. ప్రేమతో—"

"కఠినంగా మాట్లాడుతున్నందుకు మీరుకూడా నన్ను క్షమించాలి. నే నిలా ఎందుకన్నానో, కొంచెం ఆలోచిస్తే మీకే తెలుస్తుంది. ఇంతకూ అన్నయ్య బుద్ధి సరిగా ఉంటే మాకే కష్టాలూ ఉండవు. అతని బుద్ధి మారాలని ఆశీర్వదించండి," అని సతి వెళ్ళిపోయింది.

* * * * *

మాఘం వెళ్ళి ఫాల్గునం రాగానే జాహ్నవి మంచం పట్టింది. డాక్టరు మందిచ్చి బిల్లు పంపాడు. అది చెల్లించేసరికి ఇల్లు తుడిచిపెట్టినట్టయింది. "రాసిపెట్టినట్టు జరుగుతుంది. నాకు మందులుకూడా దేనికి ?" అన్నది జాహ్నవి.

సతి హరికోసం మనిషిని పంపితే, హరి ఆ మనిషిని తిట్టి పంపాడు. అతని పతనానికి దుఃఖించి సతి మళ్ళీ కబురు చేస్తే, హరి కలకత్తా వెళ్ళినట్టు తెలిసింది. ఇంట ఉండే మిగిలిన పాత్రలుకూడా అమ్ముడయాయి. సతీ, సావిత్రులు అర్ధోపవాసాలతో రోజు లీడ్చుతున్నారు.

చైత్రమాసం అఖరులో జాహ్నవి జబ్బు తగ్గింది. కాని ఆమె తిండిలేక చచ్చే ప్రమాదం హెచ్చుగా కనబడింది.

ఒకరోజు ఉదయం సతి నీళ్ళు తెద్దామని, బిందె తీసుకుని తలుపు తెరిచేసరికి ఒక ఉత్తరం ద్వారానికి తాడుతో వేళ్ళాడగట్టి ఉన్నది. దాన్ని చదవగానే సతి తల గిర్రున తిరిగింది. కమలభర్త నరేన్ సతికి ఆ ఉత్తరం రాశాడు. అతను వారి దారిద్ర్యంపట్ల సానుభూతి చూపుతూ, సతి తాను చెప్పినట్టు చేస్తే, వారి కష్టాలన్నీ గట్టెక్కుతాయన్నాడు. సతి ఆ ఉత్తరాన్ని ముక్కలు ముక్కలు చేసి, వెళ్ళి, చెరువులో చాలాసేపు స్నానం చేసి ఇంటికి తిరిగి వచ్చి, ఒంట్లో బాగాలేదని పడుకున్నది.

కాసేపటికి ఒక బ్రాహ్మడు అన్నపూర్ణ యింటినుంచి కావడిలో స్వయంపాకం



తెచ్చాడు. అన్నపూర్ణ సంక్రాంతికి బ్రాహ్మల ఇళ్ళన్నిటికీ స్వయంపాకాలు పంపి వ్రతం చేస్తున్నదిట. ఆరోజు అందరూ కడుపునిండా తిన్నారు.

రెండుమూడురోజు లయాక నరేన్ సతికి మరొక జాబు అందజేశాడు. అందులో అతను సతికి చాలా ఆశలుపెట్టాడు. సతి దాన్నికూడా చించిపారేసింది ఆ విషయం సావిత్రికికూడా ఆమె చెప్పలేదు.

వైశాఖమాసమంతా అన్నపూర్ణ వ్రతాలు మహాచేస్తున్నట్టు కనబడింది వారాని కొకసారి కావడితో కూరలూ, పళ్ళూ, మిఠాయీ వస్తూనే ఉన్నాయి. కాని ఈ ఆనందం ఎంతోకాలం దక్కలేదు. ఒకరోజు హఠాత్తుగా అప్పులవాళ్ళు ఇంటికి

జప్తు తెచ్చారు. గడువులోపల అసలుఫాయిదాలు ఆరువందలూ చెల్లించకపోతే ఇల్లు అమ్మేస్తారు ఇది సతికోసం చేసిన అప్పు సతికితప్ప మరెవరికీ ఆ అప్పుతో సంబంధంలేదు. దాన్నిగురించి ఆలోచించినకొద్దీ సతిమనస్సు క్షోభించి పోయింది.

ఆమె నీళ్ళు తీసుకురావటానికి వెళ్లేసరికి నరేన్ అక్కడ ప్రత్యక్షమయాడు.

"నిన్ను రాణిని చేస్తాను మీ అమ్మకూ, చెల్లెలికీ ఏ కష్టాలూ ఉండవు. నే చెప్పేవదానికి ఒప్పుకుంటావా? లేక మీ రంతా ఇంటింటికీ తిరిగి బిచ్చమెత్తు కుంటారా?" అని అత నడిగాడు

ఆ మాటలు వింటూ సతి వణికిపోయింది

"మీ సంగతంతా హరి చెప్పాడు నిన్ను మొదట చూచినప్పటినుంచీ నిన్నే స్మరిస్తున్నాను. మీ కీ కష్టం రాకపోతే నేను సాహసించి నిన్ను పలకరించి ఉండను. మీరు మహా మొండివాళ్ళు. ఎంతసొమ్ము కావాలో చెప్పు," అన్నాడు నరేన్.

"పో, పో! వెళ్ళకపోతే ఈనీటిలో పడి చస్తాను," అని సతి అరిచింది.

"సరే, వెళతాను. రేపీ వేళకే వస్తాను. వర్షం రాబోతున్నట్టుంది. త్వరగా ఇంటికి వెళ్ళు." అంటూ నరేన్ వెళ్ళిపోయాడు. సతి అతను వెళ్ళేదాకా నీటిలోనే ఉండిపోయింది. అదే సమాయాన దక్షిణపుగట్టువ నడిచే విశ్వేశ్వరుడు ఆగిపోయి, తనకేసి తేరిపారచూసి వెళ్ళిపోవటం ఆమె చూసింది. అతను నరేన్‌నుకూడా చూసి ఉండాలి ...

అక్షయతదియకు అన్నపూర్ణా, విశ్వేశ్వరుడూ నవద్వీపం వెళ్లి, గంగా స్నానమూ, దేవుడిపూజా చేసి నాలుగైదురోజులకు తిరిగి వచ్చారు వాళ్ళు వచ్చిన నాడే సతి వాళ్ళ ఇంటికి వచ్చివెళ్ళింది మర్నాడుదయం విశ్వేశ్వరుడు తన పుస్త కాలమధ్య సతి పెట్టిపోయిన ఉత్తరం చూసుకుని, ఇలా చదువుకున్నాడు:

"మీ కీ ఉత్తరం రాస్తున్నది సతి. రాయవలసిన విషయాలు చాలా ఉన్నాయి. కాని ఎలా రాస్తానో తెలీదు. చేతికివచ్చినట్టు రాస్తాను. రాయటానికి సిగ్గుపడ నవసరంకూడాలేదు. నేను నిర్దోషి నని మిమ్మల్ని నమ్మించటానికి ప్రయత్నించను. అయినా మీకు సంగతంతా చెప్పి మరీ సెలవు తీసుకోవాలనిపించింది.

"అయిదురోజుల కిందట గాలివాననాటి సాయంకాలం చెరువువద్ద జరిగినది మీకు జ్ఞాపకం ఉండవచ్చు. మీరు చూసినప్పుడు చెరువుగట్టు దిగి వెళ్ళిపోయినవాడు చాంద్‌పూర్ జమీందారు నరేన్‌బాదురీ. నీళ్ళలో కూర్చునిఉన్నది నేను. మీ రా

దృశ్యం చూసి, అందరూ అనుకునే విధంగానే అనుకుని, పరువుగల యింటి ఆడ పిల్లలు అలాటి పనులు చేస్తారా అనుకున్నారేమో!

"నేను నిర్దోషి నని చెప్పను; దోషినే. ఆ దుర్మార్గుడు నాలో రేపిన ఆశనుంచి తప్పించుకోలేను. అయితే నే నతన్ని వంచించాను. అతని దగ్గిర పుచ్చుకున్న దానికి ప్రతిఫలంగా నా దేహం ఇస్తానన్నాను. మీరు చూసిన మర్నాడు అతను మళ్ళీ వచ్చాడు. ఆ రోజున ఉదయమే అప్పులవాళ్ళు వచ్చి మూడురోజుల గడువులో ఇల్లు వశపరచుకుంటా మన్నారు అతను నాకు వెయ్యిరూపాయ లిచ్చాడు. ఇవాళ రాత్రి అతనితో లేచిపోయివస్తా నని మాట ఇచ్చాను. నేను నిజంగానే వెళ్ళి పోతున్నాను. కాని అతనిదగ్గిరికికాదు – మరోచోటికి.

"నా తల్లీ, చెల్లెలూ, తమ్ముడూ ఇల్లూ వాకిలీ లేక వీధులవెంట ముష్టెత్తుకు తిరుగుతారో, తిండికి మాడి చస్తారో అని భయపడి, వారు సుఖంగా కొంతకాల మైనా ఉండగలందుల కీ పని చేశాను. రూపాయలు నాకు దొరికా యని సావిత్రిని నమ్మించాను.

"మా కష్టాలను మీతో ఎందుకు చెప్పుకోలేదని మీ రడగవచ్చు. ఎందుకంటే మీరు అనాధలమైన మాపట్ల దయచూపటానికి ఎంతో ప్రయత్నించారు. మీ దయ బాణంలాగా నా గుండెలో గుచ్చుకుని ఇప్పటికే చాలా బాధిస్తున్నది. మీ ఋణాన్ని ఇంక పెరగనివ్వరా దనుకున్నాను. ఒకసారి మీరు డబ్బు పంపితే, అవి మాకు ఎంతో అవసర మైఉండికూడా తిప్పిపంపాను. మీరు మా కెవరు? మీ డబ్బు మే మెందుకు పుచ్చుకోవాలి? ఒకప్పుడు మీరు నాకు సమస్తమూ ఇయ్యగల అవకాశం వచ్చింది. కాని ఇప్పుడు మీరు చూపినది బిచ్చగత్తెపై దయ. ఆ దయ నా కవసరం లేదు. నేను గర్వంగా మీతో ఒకమాట అనేస్తాను – మొదటిసారీ, చివరిసారీకూడా – నేను మీ భార్య కావటానికి బొత్తిగా పనికిరానిదాన్ని కాను. అయినా మీరు నన్ను భార్యగా చేసుకోవటానికి ఒప్పుకోలేదు. మీరు మరొకతెను పెళ్ళాడి ఉన్నట్టయితే, మీలో ప్రేమించేశక్తి లేకపోలేదని తృప్తిపడేదాన్ని; కాని మీరు అలాకూడా చెయ్య లేదు. మీలో స్త్రీజాతిపైనే అనాదరణ అని స్పష్టమయింది. చచ్చిపోబోతూ మిమ్మల్ని శపిస్తున్నాను: ఒకనాడు మీరు స్త్రీని ప్రేమించి, ఆ స్త్రీనుంచి ప్రేమ పొందటంకన్న ప్రపంచంలో గొప్ప సుఖం ఉండదని గ్రహిస్తారు!

"ఇక నాకు సెల విప్పించండి. నేను జీవితంలో సుఖం ఎరగను, ఎరగబోను. అందుచేత చావుతప్ప నాకు మార్గాంతరంలేదు. ఆత్మహత్య భయంకరమైనదే; కాని నా భవిష్యత్తు అంతకన్న భయంకరమైనది. మీ పాదాలదగ్గిర నాకు చోటు దొరికి

ఉన్నట్టయితే ఇవాళ నేను నా అల్లికోసమూ, చెల్లెలికోసమూ, తమ్ముడికోసమూ ప్రాణాలు ధారపోయవలసిన అవసరం ఉండకపోను.

"ఒక వితంతువు పరపురుషుడికి ఇలా రాయటం తప్పని అనుకోవద్దు. నేను చాలాకాలంగా మిమ్మల్నే నా హృదయంలో నాకుకూడా తెలియకుండా దాచుకుని, చావబోతూ ఆ మూర్తిని ఇప్పుడు బయటికి తీసి చూసుకుంటున్నాను. నేను మీ నుంచి సహాయం పొందకపోవటం తప్పేమో నని ఇప్పు డనిపిస్తున్నది. మా అమ్మనూ, చెల్లెలినీ, తమ్ముణ్ణీ కాస్త కనిపెట్టి ఉండండి. నేను పోతే వారి కే కష్టాలూ ఉండవని నా కెందుకో అనిపిస్తున్నది. నేను చావక తప్పదు. ఆ దుర్మార్గుడి డబ్బు తీసుకున్నతరవాత యిక మార్గాంతరం లేదు చాతనయితే మా సావిత్రికి మంచి వరుణ్ణి చూసి పెళ్ళి చెయ్యండి నమస్కారం; శలవు.

ఇట్లు,
సతి."

ఉత్తరం చదవటం పూర్తిచేసి కొయ్యబారి కూర్చునిఉన్న విశ్వేశ్వరుడి దగ్గిరికి అన్నపూర్ణ అదుర్దాగా వచ్చి, "నాయనా, విషూ! అప్పులవాళ్ళు వచ్చి రామశంకర భట్టాచార్యుల ఇల్లు జప్తు చేస్తున్నారుట. వెంటనే వెళ్ళి ఆపుచేయించు." అంటూ కన్నీరు కార్చసాగింది.

విశ్వేశ్వరుడికి చైతన్యం వచ్చింది. సతి ఇంకా ప్రాణంతో ఉండిఉండవచ్చు. అతను వెంటనే వారి ఇంటికి పరిగెత్తాడు. ఇంటిబయట జనం పోగయారు. లోపలి నుంచి ఏడుపులు వినిపిస్తున్నాయి. జప్తువాళ్ళు అతన్ని లోపలికి పోనిచ్చారు. అప్పటికే సతి చచ్చిపోయింది. అనుమానం తీరక విశ్వేశ్వరు డామెను పరీక్షించాడు. ప్రాణం ఎప్పుడో పోయింది. శరీరం చల్లబడిపోయింది. జనం లోపలికి వచ్చి, "ఎంతఘోరం!" "ఎలా పోయింది?" "విషం ఎందుకు తిన్నది?" అని తలా ఒక ప్రశ్న వెయ్యసాగారు.

సతి తలవద్ద ఒక త్రైంసీసా, ఒక చీటీ దొరికాయి. 'నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను. ఈ సంగతి మా అమ్మకుగాని, చెల్లెలికిగాని మరెవరికికాని ఏమీ తెలియదు- సతి '' అని చీటీలో రాసిఉన్నది.

అన్నపూర్ణ వచ్చి విశ్వేశ్వరుడి చేతిలో నోట్లకట్ట పెట్టి, చెవిలో రహస్యంగా, అప్పులవాళ్ళకు డబ్బిచ్చి పంపెయ్యమన్నది. విశ్వేశ్వరుడు బయటికి వెళ్ళి, అప్పిచ్చిన మనిషిదగ్గిర లెక్క తేల్చి, మొత్తం బాకీ ఏడువందలచిల్లర లెక్క చూసి, డబ్బిచ్చి పత్రంమీద చెల్లు వేయించి, పత్రం తీసుకుని లోపలికి వచ్చాడు.



కొంచెంసేపట్లో డాక్టరూ, ఇన్‌స్పెక్టరూ కలిసేవచ్చారు. బెల్లడోనా కలిపిన తైలంతో సతి ఆత్మహత్య చేసుకున్నదని డాక్టరన్నాడు. ఆ తైలం జాహ్నవి నడుమునొప్పికోసం తెప్పించినదని ఆమె తోడికోడలన్నది.

విశ్వేశ్వరుడు డాక్టరుకూ, ఇన్‌స్పెక్టరుకూ కొంత ముట్టజెప్పినాక సతి కలరా తగిలి చనిపోయినట్టు సర్టిఫికేటు ఇచ్చి ఇద్దరూ వెళ్ళిపోయారు

జాహ్నవీ సావిత్రీ గుండెలు కరిగేటట్టు ఏడ్చారు. విశ్వేశ్వరుడుకూడా ఏడుస్తూనే కాశీని వెంటబెట్టుకుని శవాన్ని ఏటిఒడ్డుకు చేర్చి, దహనం చేయించాడు.

* * * * * *

అన్నపూర్ణ జాహ్నవిని తమ ఇంటికి వచ్చి ఉండుమన్నది. కాని జహ్నవి వినలేదు. తన భర్తా, కూతురూ పోయిన ఇంటిని తాను వదిలిపెట్టలే నన్నది. ఆమె తోడికోడలుమాత్రం, సతి దయ్యమై వచ్చి తన గొంతు పిసికేస్తుందని భయపడి వెళ్ళిపోయింది.

విశ్వేశ్వరుడు పిచ్చివాడిలాగా తిరుగుతున్నాడు. ఒకనాడతను జమీందార్ల తోటలో గానా బజానా, విందూ వినోదమూ జరుగుతూండటం చూసి తనలో తాను

వితర్కించుకున్నాడు, కొందరికి విందులూ, కొందరికి ఆకలీ దేనికి? ఒకరి విషయం ఒక రెందుకు పట్టించుకోరు? అత నక్కడ నిలవలేక దూరంగా వెళ్ళిపోతూంటే మరొక దిక్కునుంచి ప్రేమనుగురించిన గానం వినిపించింది. అతను ఆగి శ్రద్ధగా ఆ పాట వింటూ ఆనందించాడు. ఈ పాపిష్టి ప్రపంచంలో ప్రేమ దుఃఖాంతం: సతి చచ్చిపోయి మంచిపని చేసిందని అత ననుకున్నాడు.

అతను వెన్నెలలో తిరిగి వస్తూంటే భట్టాచార్యుల ఇల్లు తగిలింది. అతను లోప లికి అడుగు పెట్టేసరికి తులసికోట దగ్గర, దీపం పెట్టి, మోకరించి, చేతులు జోడించి, తల వీరబోసుకుని ధ్యానిస్తున్న మనిషి సతిలాగే కనబడింది. "సతీ" అన్న పిలు పతనికి నోటిదాకా వచ్చింది.

ఆ కూర్చున్నది సావిత్రి.

"విషుదాదా? వచ్చారా? అమ్మను పిలవనా? అన్న దామె.

"వద్దు సావిత్రీ. నీతో ఒకమాట చెప్పాలి. అక్క నీ కేమైనా ఇచ్చిందా?"

"అక్కకు నోట్లు దొరికాయట, ఇచ్చింది."

"అన్నీ ఉన్నాయా? అవి నా కిచ్చెయ్యి."

సావిత్రి లోపలికి వెళ్ళి తెచ్చి ఇచ్చిన నోట్లు తీసుకుంటూ విశ్వేశ్వరుడు, "అమ్మకు వీటి మాట తెలీదుగా?" అన్నాడు.

"ఇంకా తెలీదు. సమయం చూసి చెబుదా మనుకుంటున్నాను."

"చెప్పకు. ఇవి ఎవరివో వాళ్ళకే తిరిగి ఇచ్చేస్తాను."

సావిత్రి మెల్లిగా తల ఆడించింది. ఆమె తగని దుఃఖంలో ఉంటున్నదనీ, తిండి తినటం లేదనీ విశ్వేశ్వరుడితో పిన్ని అన్నది—అందుచేత అతను ఆమెతో కాస్త మాట్లాడదామని, "ఇక్కడ కూర్చుని ఏంచేస్తున్నావు, సావిత్రీ?"

"ప్రార్థన చేస్తున్నాను. ఆత్మహత్య చేసుకున్నవాళ్ళకు గతు లుండవుట. అందు కని తులసికోటదగ్గర దీపం పెట్టి—"

పైన మాట రాక సావిత్రి ఏడవసాగింది విశ్వేశ్వరుడి కంటకూడా నీరు తిరిగింది.

మీ అక్క స్వర్గంలో ఉంది, సావిత్రీ! అంత పుణ్యాత్మురాలికి గతులు లేక పోవట మేమిటి? ఆ మాట ను వ్వెలా నమ్మావు?" అన్నా డతను.

"అక్క స్వర్గంలో ఉందంటారా? అక్కడ సుఖంగా ఉందా?"

"చాలా సుఖంగా ఉంది."

"అయితే మరి ఏడవను అక్క సుఖంగా ఉంటే అంతేచాలు," అంటూ సావిత్రి జలజలా కన్నీరు కార్చింది.



ఆ స్థితిలో ఆమెను వదలి వెళ్ళటం సాధ్యంకాక, విశ్వేశ్వరు డామెకు దుఃఖించ వద్దని బోధచేశాడు. ఏడిస్తే పోయిన అక్క తిరిగి రాదన్నాడు.

"ఇవాళ కమల వచ్చి అక్కను తలుచుకుని ఏడ్చి, ఏడ్చి కుమిలిపోయింది. స్నేహితురాలే మరవలేకపోతే, నే నెలా అక్కను మరవను? నే నెన్నడూ అక్కను విడిచి ఉండలేదు.

"ఎవరు వచ్చారూ? నరేన్ బాదురీ భార్యేనా? ఆమె చాలా కష్టంలో ఉందిటకాదూ?"

ఒకప్పుడు సతి తనను, కమలను పెళ్లాడమని అడిగింది. అది జ్ఞాపకం వచ్చి అతనికి బాధ కలిగింది.

మర్నాడు అతను చాంద్‌పూర్‌లో జమీందా రింటికి వెళ్ళి, తోటలో బెంచిమీద విచారంగా కూర్చుని ఉన్న నరేన్‌ను చూశాడు.

"ఎవరు మీరు? ఎక్కడో చూసినట్టుంది," అన్నాడు నరేన్.

"నాపేరు విశ్వేశ్వరం మైత్ర. మాది మజుత్ పూర్. మీరు మా ఊరికి తరుచు షికారు వస్తారు. అక్కడ చూశారేమో."

"ఏం పనిమీద వచ్చారు?"

"రహస్యమైన పని ఇంకో చోటికి పోదామా?"

"ఇది రహస్యప్రదేశమే"

"విశ్వేశ్వరుడు నోట్లకట్ట తీసి అతని కిస్తూ, "లెక్కపెట్టుకోండి.. వెయ్యి రూపాయలు." అన్నాడు

నరేన్ తెల్లబోయి చూస్తూ, "ఇవి మీ కెలా వచ్చాయి?" అని అడిగాడు.

"మీ రెవరి కిచ్చారో ఆమే నా కిచ్చింది"

"ఆమె చనిపోయిందని విన్నాను?"

"చనిపోలేదు. ఆత్మహత్య చేసుకుంది."

"ఔను, అలాగే విన్నాను. ఆత్మహత్యకు కారణం తెలుసా?"

"తెలుసు. కారణం ఈ నోట్లే. వీటితో అవసరం వచ్చింది. కాని మీ చేతికి చిక్కటం ఇష్టంలేక ఆత్మహత్య చేసుకున్నది."


"అయితే మీ కంతా తెలుసున్నమాటే ఇక దానవిడం దేనికి? ఈ నోట్లు పుచ్చుకో మని నేనామెను బలాత్కరించలేదు"

"నోరుముయ్; నోరుముయ్యరా, పాపీ! పైగా మాట్లాడుతున్నావా? ఆమెకోసం ఎంతగా కారాడావు. గొప్పఇంట పుట్టినవాడివి కావా? ముండలతో కాలక్షేపం చేస్తున్నావు. చెయ్యి. కాని నీకు తల్లీ, అక్కచెల్లెళ్ళూ, భార్యా వున్నారే! పరువుగల ఆడవాళ్ళు పాపిష్టిపనులు చెయ్యరని ఎరగవా? దుర్భరమైన పరిస్థితిలో పాపానికి సమ్మతించింది. అయినవాళ్ళ ప్రాణాలు నిలవటానికి నీ డబ్బు తీసుకుని, నీకు అంద కుండా స్వర్గానికి వెళ్ళిపోయింది. ప్రాణాలు కాపాడదలచిన డబ్బు నీ చేతిలోపడి నిండుప్రాణాన్ని విలువునా తీసింది. ఛీ, ఛీ! పాపాత్ముడా! నీకంటె అధముడుండడు."

నరేన్ ఈ మాటలువడి ఊరుకున్నా. సతి చనిపోయిందని విన్నప్పుడే అతనిలో కొంత బాధ బయలుదేరింది ఇప్పుడది సంపూర్ణత్వం పొందింది.

"హరి మీ దగ్గిర బాబుగిరీ నేరుస్తున్నాడట. అతన్ని ఒకసారి పిలు," అన్నాడు విశ్వేశ్వరుడు. నరేన్ మారుపలకకుండా హరిని పిలుచుకొచ్చాడు. హరి సిగ్గుపడు తున్నవాడిలాగా తలవంచుకుని నిలబడ్డాడు.

"ఇతన్ని మీ ఇంటినుంచి పంపెయ్యి ఇతనికోసం తల్లీ, చెల్లెలూ తెగఏడుస్తు న్నారు. వాళ్ళ ఉసురు కొట్టగలదు." అన్నాడు విశ్వేశ్వరుడు నరేన్ తో.



"మీతోనే తీసుకుపొండి. ఇక నేను నాటకసమాజం నడపను. ఈ నాటకాలే నన్నింతకు తెచ్చాయి. ప్రస్తుతహా నేను చెడ్డవాణ్ణికాను," అన్నాడు నరేన్.

"నాకు తెలుసు. నీకోసం నీ భార్య కమలకూడా తెగఏడుస్తున్నదిట. ఇవాళో, రేపో ఆమెకూడా ఆత్మహత్య చేసుకున్నదంటే నీ పాపం రెండింత లవుతుంది."

విశ్వేశ్వరుడు హరిని వెంటబెట్టుకు బయలుదేరుతూ నరేన్‌తో, "నరేన్: నేను పోతున్నాను. జ్ఞాపకం ఉంచుకో—సతీ, నీ భార్య కమలా ఒకే ప్రాణంగా ఉండేవాళ్ళు. సతికి క్షమాపణ చెప్పుకోవాలని నీకేకోరికున్నా ఉంటే కమల దుఃఖపడకుండా చూడు. ఇంతకంటె నేను చెప్పేదిలేదు." అన్నాడు.

* * * *

భట్టాచార్యులవారిల్లు ఎలాగైతేనేం మరమ్మతు అయింది. ఆ యింటినుంచి దుఃఖదేవత తొలగిపోయినట్టయింది. హరి ఇంటిపట్టునే ఉంటున్నాడు. ఇంటివారికి బాగానే జరిగిపోతున్నది.

విశ్వేశ్వరుడు సావిత్రికోసం సంబంధాలు చూస్తున్నాడు. వచ్చే శ్రావణ మాసంలో పెళ్లి అవుతుం దనుకుంటున్నారు. ఒక సంబంధం వరుడు బాగా చదివిన వాడు. రెండుమూడు పెద్ద పరీక్షలు పాసయినాడు మంచివంశం. స్థితిపరులు. పిల్లవాడి తండ్రి బతికే ఉన్నాడు.

విశ్వేశ్వరు డీ సంబంధం మాట చెబితే అన్నపూర్ణ. "వరకట్నం ఏ పాటి ఉంటుంది?" అని అడిగింది.

"అటువంటి వరుడికి కట్నం బాగా ఉండదా? డబ్బు పొయ్యాలి. నీ కెందుకు? నీ డబ్బుపెట్టె నా కిచ్చేయి," అన్నాడు విశ్వేశ్వరుడు నవ్వుతూ.

"పై వారంలో మంచి ముహూర్తం ఉంది. దానికి పెళ్లి అయేట్టు చూడు.

పెళ్లి ప్రయత్నా లారంభమై చురుకుగా సాగుతున్నాయి. పందిళ్లూ, పాకలూ వేశారు పెళ్లికిముందు పెళ్లికూతురుకి విందులు చెయ్యటం బెంగాలీల ఆచారం. ఎల్లుండి పెళ్ళి అనగా సావిత్రిని అన్నపూర్ణ భోజనానికి పిలిచింది.

భోజనా లయాక విశ్వేశ్వరుడు సావిత్రిని, "నీకు కుదిరిన సంబంధం నీ కిష్ట మేనా, సావిత్రీ?" అని అడిగాడు.

"అలా అడుగుతారేం? మీరు సంబంధం కుదర్చటమూ అది నా కిష్టం కాక పోవటమూనా?" అన్నది సావిత్రి.

"అవును, సావిత్రీ. రాత్రింబగళ్లు నేను నీ సుఖం గురించే ఆలోచిస్తున్నాను—"

అతనిమాట పూర్తి అయేలోపల సావిత్రి అతనిముందు సాష్టాంగ నమస్కారం చేసింది. అతను కంగారు పడ్డాడు.

"ఒక్కమాట అడగాలనుంది. పెళ్ళయినాక వాళ్లు నన్ను వెంటపెట్టుకు పోతారా?" అన్నది సావిత్రి.

"అలా అడుగుతావేం? తప్పక తీసుకుపోతారు."

"అయితే మరి అమ్మదగ్గర ఎవ రుంటారూ? అక్క లేనేలేదు. నేనుకూడా లేక పోతే అమ్మనూ, తమ్ముణ్ణీ ఎవరు కనిపెట్టి ఉంటారూ? కొంతకాలమైనా న న్నిక్కడే ఉంచలేరా?"

విశ్వేశ్వరుడు నవ్వి, "అదెలా కుదురుతుంది, సావిత్రీ?" అన్నాడు.

సావిత్రి కొంచెం ఆలోచించి, నిట్టూర్చి, "భయంలేదనుకోండి—మీ రుంటారు; అన్న య్యుంటాడు. మీరు అమ్మను కనిపెట్టుకుని ఉంటారు," అన్నది.

అందరిలాగా నువు పెళ్ళిగురించి సిగ్గు పడవేం?"

"తల్లిదండ్రులకు భారం కానివాళ్ళకు సిగ్గు. నా కెందుకు?"



"అదేమిటి, సావిత్రీ? నువ్వెవరికి బరువు?"

"నాకోసం మీ రెంత శ్రమపడుతున్నారో నాకు తెలీదా?"

"ఇదికూడా కష్టమేనా? నీ సుఖమే నేను కోరుతున్నది. ఈ సంబంధం నీకు నచ్చకపోతే మరొకటి చూస్తాను."

"మీరు చూసిన సంబంధం మంచిది కాకపోయినా నాకు సంతోషమే. ఆ విషయము మీరు రూఢిగా ఉండండి మీరు దేవుడిలాగా మా కెంత సహాయం చేశారో నే నెప్పటికైనా మరవగలనా? అక్క మమ్మల్ని మీకు అప్పజెప్పి వెళ్ళింది."

"వీళ్ళు దేవతలు! ఈ లోకంలో ఎందుకు పుట్టారో తెలీకుండా ఉంది," అని తనలో అనుకున్నాడు విశ్వేశ్వరరావు...

మర్నాడు మధ్యాహ్నం పెళ్ళివారు వచ్చేసరికి విడిది సిద్ధంగా ఉంది. విశ్వేశ్వరుడు వారికి తెగమర్యాద చేశాడు. వరుడి రూపమూ, అందమూ చూసి అతను

తృప్తిపడ్డాడు గావి, అతనితండ్రి అహంకారిగానూ, డబ్బుదాహం గలవాడుగానూ కనిపించాడు.

మర్నాడు పగలు గడిచింది. రాత్రి ఆరంభంలోనే లగ్నం. మగవాళ్ళుండేచోట విశ్వేశ్వరుడికీ, ఆడవాళ్ళుండేచోట అన్నపూర్ణకూ ఊపిరి సలపనంతపని. మనుషుల అడావుడితోనూ, బాజాల మోతతోనూ పెళ్ళిల్లు కోలాహలంగా ఉంది.

జాహ్నవి సావిత్రిని తీసుకొచ్చి పీటలమీద కూర్చోబెట్టింది. విశ్వేశ్వరుడు పెళ్ళికొడుకుని తెచ్చి సదస్యులమధ్య కూర్చోబెట్టాడు హరికి ఏమనాలో నేర్పారు; అతను వచ్చి, "కన్యాదానానికి అనుమతి ఇవ్వండి" అని సభవారి నడిగాడు.

"ముందు కట్నం సొమ్ము తీసుకురండి," అని పెళ్ళిపెద్ద అరిచాడు.

కట్నం సొమ్ము మూడువేలూ తెచ్చి పెళ్ళిపెద్ద ముందుంచారు. అవి లెక్కచూసి, పెళ్ళికూతుర్ని తీసుకురండి; నగలు చూడాలి!'' అన్నాడు పెళ్ళిపెద్ద.

''లోపలికి వచ్చి చూసుకోండి," అన్నాడు విశ్వేశ్వరుడు.

పిల్లను సదస్యుల మధ్యకే తీసుకురావటం తమ ఆచారమని పెళ్ళిపెద్ద అన్నాడు. అది మా ఆచారం కాదు. తీసుకురామని విశ్వేశ్వరు డన్నాడు. సదస్యులు రాజీ చేసి పిల్లను పెళ్ళిపెద్దముందుకు తెప్పించారు. ఆయన నగలు తణిఖీ చేసి, తృప్తిపడి, "కన్యాదానం ఎవరు చేస్తారు?'' అన్నాడు.

విశ్వేశ్వరుడు హరిని చూపించి, "ఇతను చేస్తాడు. పిల్ల అన్నగారు," అన్నాడు.

"ఆమాట మొదట ఎందుకు చెప్పలేదు? ఇంకో వెయ్యి ఇస్తేగాని ఈ పెళ్ళికి ఒప్పుకోను," అన్నాడు పెళ్ళిపెద్ద.

"ఇంకోవెయ్యి ఇయ్యాలా? ఏమిటీ అసందర్భప్రసంగం? మీ రేం పెళ్ళి చేసుకోవటానికి రాలేదా," అని విశ్వేశ్వరు డడిగాడు.

"మధ్య నువ్వెవరు? ఆడపిల్ల తరపు పెళ్ళిపెద్ద ఎవరైనట్టు? మీ కులానికి తగ్గట్టే ఉంది మీ పద్ధతి," అన్నాడు వరుడితండ్రి.

"ఇక్కడ పెళ్ళిపెద్దను నేనే; ఏం చెబుతారు? మీ కట్నం మీకు ముట్టిందే?"

"ఇదలాటి వంశమని నాకు ముందు తెలుసా? పిల్లఅక్క విషం తిని చచ్చిందిట!"

"జాగ్రత్త! ఆలోచించి సరీ మాట్లాడు," అని విశ్వేశ్వరుడు రంకె పెట్టాడు.

"ఇంకా ఆలోచించే దేమిటి? ఈ పెళ్ళి మాకు వద్దనే వద్దు. లేవరా అబ్బాయ్! పదండి బయటికి.''

"తొందర పడకండి! ఆగండి! ఇలా చెయ్యరాదు," అని నలుగురూ నాలుగు రకాలా చెప్పిచూశారు.